# మనుగడలో మానవత్వం

కప్పగంతుల మల్లికార్జున రావు





**అవసరంలో** ఉన్న వారికి చిన్న చిన్న చేబదుళ్ళు ఇవ్వటం చిన్నప్పటినుంచీ నాకు సరదా. చిన్నప్పుడు గోళీకాయలు, బలపం ముక్కలు ఇస్తే, పెరిగి పెద్దయ్యే కొద్దీ అది పైసల్లోకి, రూపాయల్లోకి, ఇప్పుడు పదులు పాతికల్లోకి పరిణామం చెందుకుంటూ వచ్చింది. అలా చేబదుళ్ళు ఇస్తున్నందువల్ల నేనేదో గొప్పవాడినైన ఫీలింగ్ నాకెన్నడూ కలగలేదు. దేశానికి సేవచేస్తున్నానన్న భావం అసలు కలగలేదు. అలా చెయ్యటం నా ఆత్మ సంతృప్తి కొరకే నని నాకు తెలుసు.

"గొప్ప హాబీరా, నాయనా, నీది. జమీందారుల హాబీ. వందలో పది మందికి ఈ హాబీ ఉంటే బ్యాంకీలకు, మార్వాడీలకు పనే ఉండకపోను."

నేనేం పెద్ద ధనవంతుడిని కాను. చేస్తున్నది బతకలేని బడిపంతులు ఉద్యోగం. కాకపోతే కాలేజీలో కనుక కాస్త ఫర్వాలేదు.


అయితే నాకు మొదటినుంచి మనుష్యుల మీద నమ్మకం జాస్తి.


నేనేం దానాలు చేస్తున్నానా? చేబదుళ్ళు తిరిగి ఇచ్చేవేగదా? నాకు మిగిలిన డబ్బును మరొకరికి అవసరానికిస్తే నష్టం ఏమిటి?

"ఏమిటా? ఒక్కసారి ఎవడో నీ మంచితనాన్ని నిలువునా ముంచితేనే గానీ అర్థంకాదులే. ఆ మిగులు డబ్బును వడ్డీలు రాని చేబదుళ్ళిచ్చే బదులు బ్యాంకీలో వేసుకొంటే పిల్లలు పెడుతుంది గదా? పోనీ వడ్డీ వ్యాపారమైనా చేసుకోరాదూ?"

వడ్డీ నష్టపోతున్నానని నాకు తెలుసు. కానీ నా ఆత్మ సంతృప్తికి విలువేం లేదా? ఆ వడ్డీ డబ్బుతో ఆ తృప్తిని కొనుక్కొంటున్నా ననుకొంటే సరిపోలేదూ?

నేను పదులు పాతికలు కన్నా మించి ఎవరికీ చేబదుళ్ళు ఇవ్వనని అందరికీ తెలుసు. అదీ మనిషినిబట్టే ఇస్తాను. అవసరాన్ని అంచనా వేసి చూస్తాను.




పెద్దగా నాకు 'అసలుకే' నష్టం రాలే దెప్పుడూ. వంద మందిలో నలుగురో అయిదుగురో అడపా దడపా అయిదో పదో ఎగగొట్టినా నాకు మనుష్య లందర్నీ మోసగాళ్ళుగా చూడాల్సిన అవసరం కన్పించ లేదు. అందుచేత ఎవరెన్ని విధాల నన్ను భయపెట్టినా మనుష్యులపైన విశ్వాసాన్ని పోగొట్టుకొని నా కున్న వో మంచి అలవాటును నష్టపోవాలన్న ఆలోచనే నాకు రాలేదు చాలాకాలం.

అయితే మూర్తి నా విశ్వాసాన్ని పునాదుల్తో కదిలించేసి నన్ను కొత్త దిశలో ఆలోచింప చేసేడు.

మూర్తి, నేను స్నేహితులం అని చెప్పుకొనే వీలులేదు. కాకపోతే చాలాకాలంగా పరిచయముంది. పూర్వం ఎప్పుడో వో చోట కలిసి పనిచేసేం. మళ్ళీ మా కాలేజీలో రెండేళ్ళు ఈ మధ్య గుమాస్తాగా పనిచేసేడు మూర్తి. ఇటీవలే బదిలీ అయింది మరోచోటుకి.

ఒక రోజు ఆదివారం మా ఇంటికి వచ్చాడుమూర్తి. టిఫిన్, కాఫీ మర్యాదలు చేసేను. తన బదిలీకి కారకు లని చాలా మందిమీద అభియోగాలు చేసేడు. ప్రిన్సిపాల్ అసమర్థుడని తిట్టేడు.

నాకు పెట్టీ రాజకీయాలంటే అసహ్యం. కురచ మనస్సు గల మనుషులంటే జాలి, అయినా భరించక తప్పేదేముంది?

"ఈ బదిలీ వల్ల నేను చాలా విధాల నష్టపోయాను, మాస్టారూ. ఫామిలీ ఇక్కడ. నేను అక్కడ. రెండు కాపురాలు... రాకపోకలు ... శ్రమకు శ్రమ ... బోలెడు ఖర్చు. అసలే నా భార్య ఆరోగ్యం అంతంతమాత్రం అని మీకు తెల్సు అనుకొంటాను. ఇప్పుడు డాక్టరు బోలెడన్ని మందులు రాసిచ్చింది. ఇదిగో చీటీ. నా దగ్గర సమయానికి డబ్బు లేదు. ఏం చేయాలో తోచటం లేదు."

చేబదుళ్ళ వ్యవహారమే. కానీ జీతాల రోజు దాటి విండా నాలుగు రోజులు కాలేదే!

"ఎల్. పి. సి. పంపక నా జీతం ఆగిపోయింది, సార్. అన్ని విధాల నన్ను ఇబ్బంది పెడ్తున్నారు ఆఫీసువాళ్ళు. కావాలని కచ్చకట్టి కొందరు—అస మర్థత వల్ల కొందరు ..."

గవర్నమెంటు సర్వీసులో బదిలీ అయినప్పుడు ఇక్కడి నుంచి 'లస్ట్ పే సర్టిఫికేట్' పోతే కాని కొత్త చోట వారు జీతం డ్రా చేయరు. ఎల్. పి. సి. ఉద్యోగి చేతికిచ్చి పంపాలని కాగితం మీద రూలు ఉంది కాని పంపరు. అలాంటి బాధలు పడ్డ నాకు ఆ కష్టాలు తెల్సు.

"దాందేముంది మూర్తిగారూ. ఇంతగా చెప్పాలా మీరు! ఎంత కావాలి!" పాతికో, యాభయ్యో అడుగుతా డనుకొన్నాను.

కానీ ఏకంగా అయిదొంద లడిగేడు. నాకు మతి పోయింది.

"మీరు చిన్న చిన్న మొత్తాలు చేబదుళ్ళుగా ఇస్తారని నాకు తెల్సు, మాస్టారూ. కానీ ఇది చేబదులుగా అడగటం లేదు. నోటు రాసిస్తాను— వడ్డీ వేసి."

"కానీ నేనంత ధనవంతుడిని కాను మూర్తిగారూ. చిన్న చిన్న మొత్తాల్లో నేను చేబదుళ్ళు ఇచ్చే మొత్తమే రెండొందలకు మించదు."

మూర్తి ప్రాధేయపడ్డాడు. చేతి గడియారం కుదవబెడ్తా నన్నాడు. అదన్నాడు, ఇదన్నాడు. ఆఖరికి నేను మూడొందరల రూపాయలుచేబదులు ఇచ్చేలా చేసేడు.

"జీతం రాగానే తెచ్చిఇచ్చేస్తాను, మాస్టారూ..." అంటూ మూడొందలు తీసుకొని వెళ్ళిపోయాడు.

అంతే. నెల ... రెండు నెలలు ...

కనిపించిన మూర్తి మొహం తప్పించుకుని పో పోగేడు. అంతే కాక నా మీద ఏవేవో కథల్లి అందరికీ చెప్తున్నాడని కూడా తెల్సింది.

"మూర్తికి అప్పిచ్చావా ఏమిటి? నిన్ను విమర్శి స్తున్నాడులే. అందుకు అడుగుతున్నా." వో మిత్రు డన్నాడు.

కళ్ళు తెరిచి విచారిస్తే మూర్తిని గురించి చాలా విషయాలు తెల్సేయి.

బదిలీ కాగానే అతని ఎల్. పి. సిని మా కాలేజీ ఆఫీసు వారు పంపేరు. నా దగ్గర అప్పుడు వచ్చే ముందు జీతం కూడా పుచ్చేసుకున్నాడు.

మూర్తి మోసకారి. అతను అప్పులు చేయని చోటు లేదు. అబద్ధ మాడని మాట ఉండదు.

డబ్బు నష్టపోయి నందుకన్నా, మోసం చేయ బడినందుకు, లేకపోతే నా అజ్ఞానానికి నేను విపరీతంగా బాధపడ్డాను. మంచిదైనా గుడ్డి విశ్వాసం ఎంతటి బలహీనత?

ఎవరికో అప్పు లిచ్చి ఉట్టి పుణ్యానికి నే నెందుకు మానసికంగా బాధ పడాలి? అనవసరంగా నాకు నే నెందుకు శిక్ష విధించుకోవాలి?

నాకు తోటి మనుష్యుల మీద విశ్వాసం నశిం చింది. ఇకమీదట ఎవరికీ చేబదుళ్ళు ఇవ్వరాదని నిర్ణయాన్ని తీసుకున్నాను.

"ఒక వ్యక్తి తప్పుకు పది మందిని అనవసరంగా శిక్షిస్తున్నావేమో! నీ నిర్ణయాన్ని పునరాలోచించుకో రాదూ?" శేఖరం సలహా ఇచ్చాడు.

శేఖరం కొన్ని ప్రిన్సిపుల్స్ ఉన్న వ్యక్తి. జీవితంలో క్రమశిక్షణకు కట్టుబ డిఉండే వ్యక్తి. నేను గౌరవించే వ్యక్తి.

అయినా ఈ విషయంలో నేను అతని సలహాను పాటించలేదు. పైసా చేదులు ఇవ్వకూడదన్న నిర్ణ యాన్ని ఖచ్చితంగా అమలు జరిపాను.

● ● ● ●

"మాస్టారూ," క్లాసుకు ప్రిపేర్ అవుతున్న నేను తలెత్తి చూచాను.

చైనులు! దీన వదనంతో నిలబడి ఉన్నాడు 'ఏమి'టన్నట్లు తల ఆడించాను.

చైనులు మా కాలేజీ ఆఫీసులో గుమాస్తా. విజాయితీ పరుడని, వర్క్‌లో ఎఫిషియెంట్ అని పేరు. అయితే అతనికి బతకటం చేతకాదు. అందుకే నా దగ్గర రెగ్యులర్‌గా పది పాతిక చేబదుళ్ళు తీసుకునే వ్యక్తుల్లో చైనులు ఒకడు

"మీతో పర్సనల్‌గా మాట్లాడాలి, సార్. కొంచెం

ఇలా వస్తారా? ప్లీజ్.

ఇదీ చేబదులు కోసేనని నేను గ్రహించాను. పూర్వం అయితే పబ్లిక్‌గా అడిగి పబ్లిక్‌గా తీసుకు వెళ్ళేవారు. కానీ ఇప్పుడు నేను చేబదుళ్ళు ఇవ్వటం మానేశాను కదా? అందుకే రహస్య అభ్యర్థన.

"మాస్టారూ! నా కొడుక్కి సీరియస్‌గా ఉందని, హాస్పిటల్‌లో ఉన్నాడని మీకు తెలుసు. డాక్టర్లిప్పుడు అతన్ని రాయవెల్లూరో, మద్రాసో తీసుకెళ్ళ మన్నారు. ఇక్కడ లాభం లేదుట!"

ఆ తరవాత అతను కోరబోయేది నాకు తెలుసు"

"మీ అబ్బాయికి ఆరోగ్యం బాగా లేదని నాకు తెలుసు చైనులుగారూ చాలా విచారిస్తున్నాను. మీరు అబద్ధం చెప్పరన్న నమ్మకం నా కుంది. కానీ మీకు తెలుసుగా. నేను చేబదుళ్ళు ఇచ్చే అలవాటుకు స్వస్తి చెప్పాను. దాన్ని మళ్ళీ పునరుద్ధరించను."

"ఇప్పుడునేను చేబదులు అడగటానికి రాలేదు. మాస్టారూ. పసులుపాతికలతో నా సమస్య సాల్వు కాదు కదా? ఐయిదొందలైనా చేతిలో ఉంటే తప్ప కుర్రాడిని డాక్టర్లు చెప్పిన చోటికి తీసుకెళ్ళ లేను. నోటు రాసిస్తాను వడ్డీ వేసి. అప్పుగా ఇచ్చి పుణ్యం కట్టుకోండి."

అదే మొత్తం. అవే మాటలు. నాకు మూర్తి గుర్తు కొచ్చాడు.

అయితే చైనులు ఎన్ని విధాల ప్రాధేయ పడినా నేను మెత్తబడలేదు.

"అడగని వాడిది పాపమన్నట్లు ఆదుకునే వారు సార్. మీరే ఇలా కఠినత్వం వహిస్తే నా బోటి వాళ్ళ గతేం కాను? నాకు దిక్కెవ రిప్పుడు?" చైనులు కళ్ళ నీరు కుక్కుకుంటూంటే నాకు జాలి వేసింది కానీ అంతలోనే మూర్తి గుర్తు కొచ్చాడు. బిగుసుకు పోయాను.

"చైనులుగారూ అలా నిరాశ పడకండి. ఆ డబ్బు నే నిస్తాను."


ఆ మాటలు అన్నది నేను కాదు. మా ఇద్దరినీ గమనిస్తున్న శేఖరం.

శేఖరంకూడా లెక్చరర్ అయినా అతనికి రాబడి కన్నా బాధ్యతలు ఎక్కువ. ప్రతి పైసాను ప్లాన్ ప్రకారం ఖర్చు పెట్టి గంపెడంత కుటుంబాన్ని అప్పు ల్లేకుండా గౌరవంగా, గుంభనంగా నడిపించు కొస్తున్న వ్యక్తి. అటువంటి శేఖరం చైనులు అయి దొందలు అప్పు ఇస్తాడా? అందునా నెలాఖరులో!

"అప్పు లిచ్చే శక్తి నాకు లేకపోవచ్చు చైనులు గారూ. కానీ నిజంగా అవసరంలో ఉన్న ఒక మనిషిని ఆదుకోలేకపోతే మనిషి మనుగడ వ్యర్థం కదా? మానవత్వానికి అంత మహాపచారం జరగకూడదు. సహాయం చేయాలన్న ఇచ్ఛే ఉంటే మార్గానికే కొరతా? పదండి వెళదాం."

శేఖరం ఆ మాటలన్నీ నన్ను ఉద్దేశించి అని ఉండక పోవచ్చు. కానీ ఆ క్షణంలో ఆ మాటలు నా గుండెల్ని తాకింది. చిత్రమేమిటంటే, నాకు కరుణ కలగ లేదు. కాగా నేను ఇవ్వనన్న అప్పును తను ఇచ్చి నందుకు శేఖర్‌పై కోపం వచ్చింది.

శేఖరం అప్పును చైనులు ఎప్పటికీ తిరిగి ఇవ్వ




కపోతే బాగుండు ననిపించింది నాకు.

● ● ● ●

శేఖరం తన వేలి ఉంగిరం అమ్మి చైనులుకు నోటన్నా రాయించుకోకుండా అప్పు ఇచ్చాడని తెలిసి నప్పుడు నాకు శేఖరం మంచితనంపై జాలి వేసింది. మూర్తి నాకు మూడొందలు ఎగవేస్తే నేనా నష్టాన్ని తట్టుకోగలను. కానీ శేఖరం స్థితి అలాంటిది కాదే! ఐయిదొందలు అతనికి చాలా విలువైనవే!

కొడుకు ఆరోగ్యం బాగు చేయించుకుని తిరిగి వచ్చాడు చైనులు. రెండు జీతాలు కూడా పుచ్చు కున్నాడా తరవాత. కానీ శేఖరం అప్పు తీర్చిన జాడ కనిపించ లేదు. శేఖరం నాతో ఆ విషయం ప్రస్తా విస్తాడనుకున్నాను. ఉత్కంఠ ఆపుకోలేక నేనే ఒక రోజు అడిగేశాను.

"చైనులు ఐయిదొందలు అప్పు తీర్చాడా?"

"లేదు. పాపం అతనింకా ఆ దెబ్బనించి కోలుకో లేదు."

"అసలెప్పటికైనా తీరుస్తా డన్న నమ్మకం నీ కుందా?.

శేఖరం నా వైపు ప్రసన్నంగా చూచి మెల్లగా నవ్వాడు.

"మానవ సమాజం యొక్క మనుగడకు ఆలంబనం మానవత్వం, ఆ మానవత్వానికి విలువ నిచ్చేది తోటి మనిషిపై విశ్వాసం అని నా నమ్మకం.

"కానీ ఆ విశ్వాసం వంచించబడితే?

అలా ప్రశ్నించి వాదనకు దిగలేదు నేను. ఇలాంటి విషయాలు తర్కవ భర్జనల వల్ల తేలవు. విశ్వాసానికి గీటురాయి స్వానుభవం.

● ● ● ●

హఠాత్తుగా ఆ దృశ్యం నా కళ్ళ పడింది. విస్తు పోయాను.

ఒక వైన్ బార్ ముందు చైనులు రిక్షా దిగి లోపలికి వెళ్ళాడు. మనిషి ట్రిమ్‌గా అలంకరించు కుని ఉన్నాడు. ఆ క్షణంలో అతని చూచిన వారెవరూ అతనో కాలేజీ ఆఫీసులో గుమాస్తా అంటే నమ్మరు.

చైనులు మంచివాడని పేరు. మూర్తి మాత్రం మంచివాడు కాదూ ఒకప్పుడు? మంచితనానికి మనిషి చెడిపోవటానికి మధ్య సరిహద్దు ఎంత? ఒక బ్రాందీ సీసా పేక ముక్కలు. నో పిల్ లేక స్త్రీ!

మంచితనపు ముసుగులో ఎన్నెన్ని పెద్దపులులో? మంచితనం అప్పులు సంపాదిస్తుంది. పెద్దపులి ఎగ గొట్ట మంటుంది.

కొడుకు ఆరోగ్యాన్ని అడ్డం పెట్టుకుని చైనులు ఎవరి వద్ద ఎన్నెన్ని అప్పులు చేసేడో! శేఖరం అప్పు గోవిందా. అతనికి మనుషులపై గల విశ్వాసమూ గోవిందానే!

ఆ భావన నాకు అదో విధమైన ఆనందాన్ని తృప్తిని కలిగించినట్లు నేను తెలుసుకున్నాను. శేఖరం పైన ఏదో విజయం పొందినట్లు గర్వం!

నాలో చైనులు పట్ల ఉత్సుకత పెరిగింది. రహస్యంగా అతని కథను ఆ రాత్రి గమనించాలన్న నిర్ణయాని కొచ్చాను.

బార్ అటెండర్ చైనులుకు పేక్ చేసిన నో పెద్ద సీసా ఇచ్చాడు. చైనులు వంద రూపాయల నోట్లను కాష్ కౌంటర్ బల్ల మీద పెట్టేడు. అంటే ఖరీదైన సరుకన్నమాట. పూరి వారి డబ్బు కదా మరి!

చైనులు కాలుస్తున్న సిగరెట్టును కాలికిందవేసి నొక్కేసి బయటి కొచ్చాడు. కిళ్ళీ బడీ వద్ద కెళ్ళి నాలుగు స్పెషల్ కిళ్ళీలు కట్టించాడు. కాస్ట్లీ కింగ్ సైజు సిగరెట్టు పెట్టెలు నాలుగు తీసు కొన్నాడు. అతని జేబులో మంచి నోట్ల కట్టలు నీటి జలలా వూరుతున్నాయి.

తనకోసం వేచి ఉన్న రిక్షా ఎక్కబోయి ఏదో గుర్తు కొచ్చిన వాడిలా పక్కన స్వీట్ మీట్ షాప్‌వద్ద కెళ్ళి, పాలకోవా, జీడిపప్పు ఇంకా ఏవేవో తినుబండా రాల పొట్లాలు కట్టించాడు. అవన్నీ నో అందమైన జిప్ బేగ్‌లో పెట్టుకొని రిక్షా ఎక్కాడు.

నేను నా సైకిలుమీద రహస్యంగా అతని రిక్షాను వెంబడించాను.

సెంటర్లో రిక్షాను ఆపి చైనులు పూల దండ పొట్లాం కట్టించాడు. పండ్లు కొన్నాడు. అంటే

రాత్రికి అతను నడపబోయే కథలో స్త్రీ పాత్ర కూడా ఉన్నట్లే కదా? పంచ'మ'కారాలలో ప్రసిద్ధుడే అయ్యుంటాడు చైనులు!

చైనులు ముసుగు తొలిగే కొద్దీ నాలో ఉత్సుకత పెరగసాగింది. రేపు నేను తెలుసుకొన్నదంతా వింటున్నప్పుడు శేఖరం రియాక్షన్ ఎలా ఉంటుందో?

వెళ్ళి వెళ్ళి రిక్షా కొత్తగా వెలసిన కాలనీ వైపు మళ్ళింది. అంటే నేను వూహించినట్లే చైనులు ఇంటికి వెళ్ళడం లేదు. ఎవరో పరాయి స్త్రీ వద్దకెళ్తున్నాడు.

ఆ కాలనీ ధనవంతులు కట్టుకొన్నది. అన్నీ అధునాతనంగా కట్టబడ ఇళ్ళు. అందులో వో చిన్న ఇంటి ముందు ఆగింది రిక్షా.

ఇల్లు చిన్నదయినా అందంగా ఉంది. చుట్టూ కాంపౌండ్ వాల్, తోట.

చైనులు రిక్షా దిగి లోపలికి నడిచేడు. తన సొంత ఇల్లే అయినట్లు గేటుకు తాళం వేసేడు లోపలి నుంచి.

నే నేం చెయ్యటానికీ తోచలేదు. కాంపౌండ్ గోడ చిన్నదే. దూకి లోపలికి వెళ్లే? కానీ ఎవరైనా చూస్తే పరువు పోదూ?

అస లా ఇల్లు ఎవరిదో?

చైనులు ఇంట్లోకి వెళ్ళాక అద్దాల కిటికీలో నుంచి రెండు నీడలు కన్పించాయి నాకు. వో పురుషుడు—వో స్త్రీ! నేను జాగ్రత్తగా చూస్తున్నాను. మరి కాస్సేపటికి ఆ గదిలో లైట్లు ఆరిపోయాయి. అంతే ...

నేను ఏదన్నా క్లూ దొరుకుతుందేమోనని వెదుకుతుండగా నా దృష్టి గేటుకు పక్కన గోడలో బిగించి ఉన్న నేమ్ ప్లేట్ పై పడింది.

"నటరాజ నిలయం..."

అది భవనం పేరన్న మాట! మరి అసలు ఇల్లెవరిదో? గేటుకు ఆవతల పక్క గోడ వద్ద కెళ్ళి చూచాను.

"రాణి ప్రభావతీదేవి— జూనియర్ సినీ ఆర్టిస్ట్."

• • • •

ఏదో ఆనందం ... తృప్తి ... ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు.

మర్నాడు ఆదివారం కనుక నేరుగా శేఖరం ఇంటికెళ్ళాను.

శేఖరం నేను చెప్పినదంతా విని కాస్సేపు మౌనంగా ఉండిపోయాడు. వినకూడనిది విన్నప్పుడు కలిగే షాక్ అది.

"నేను చెప్పింది మీకు నమ్మాలని అనిపించదని నాకు తెలుసు, శేఖరంగారూ. మూర్తి విషయంలో అతను 'సకల గుణ శేఖరు'డని తెలిసినప్పుడు నేనూ ఇలాగే షాక్ తిన్నాను."

శేఖరం మౌనంగా లేచాడు.

"రండి. చైనులు ఇంటికే వెళ్ళి సత్యాసత్యాలు తెలుసుకొందాం."

"దోషి నేరాన్ని అంగీకరిస్తాడన్న నమ్మకం మీ కున్నదా? అందులోనూ అతని గృహంలో భార్యా బిడ్డల సమక్షంలో..."

"చూద్దాం. కానీ ఏదైనా అతని ఇంట్లో అతని భార్యా బిడ్డల ముందు అతనికి పరీక్ష పెట్టడం మంచిది కదా?"

మేము వెళ్ళేసరికి చైనులు ఇంట్లోనే నిద్రపోతున్నాడు. పోక ఏం చేస్తాడు? రాత్రంతా నిద్ర లేదాయె!

అతని భార్య మమ్మల్ని కూర్చోమని, భర్తను లేపి పంపిస్తానని లోపలికి వెళ్ళింది.


"శేఖరంగారూ! మీరేవచ్చారా? సాయంకాలానికి నేనే మీ ఇంటికి వస్తానని చెప్పేను కదా?" అపాలజిటిక్ గా అన్నాడు.

అప్పులిచ్చిన వాళ్ళు నమ్మినంత కాలం తీసుకున్న వాళ్ళు ఇలా ఎన్నైనా చెప్తూనే ఉంటారు.

"ఒక్కక్షణం. సార్. ఇప్పుడే వస్తాను."

చైనులు లోపలి కెళ్ళాడు. అతని భార్య కాఫీ తీసుకొచ్చి ఇచ్చింది. మేము కాఫీలు ముగించేసరికి చైనులు తిరిగి వచ్చాడు.

"నేను ఆపదలో ఉన్నప్పుడు మీరు ఉంగరం అమ్మి నాకు అప్పు ఇచ్చారు, శేఖరంగారూ. మీ ఋణం ధన రూపంలో ఎంత ఇచ్చినా తీరదు. ధన రూపంలో తీర్చడం కూడా ఆలస్యమయినందుకు

నే నెంతో విచారిస్తున్నాను. నా పరిస్థితిని మీకు ఎప్పటి కప్పుడు వివరించు కొంటూనే ఉన్నాను''

అందులో నాకు తెలియని ఒక్క కొత్త డైలాగు లేదు. హరికథ!

''మీరు అప్పును నాకు చేబదులుగా ఇచ్చారు. కానీ మీ రిచ్చిన ధనానికి కనీసం బ్యాంకు వడ్డీనైనా కలిపి ఇవ్వటం ధర్మంగా నేను, భావిస్తున్నాను. ఈ కాగితంలో ఆ లెక్కలు వేసేను. ఇదిగో ధనం.''

చైనులు బాకీ తీరుస్తున్నాడు. శేఖరం స్వీకరిస్తున్నాడు ధనాన్ని.

ఏదో పరాజయం పొందిన బాధ నన్ను వేధించింది. నా కళ్ళను, చెవులను నేను నమ్మలేకపోతున్నాను. కారణం నా మనస్సుకు తెలుసు. మూర్తి నాకు బాకీ ఎగవేసినట్లే, చైనులు శేఖరం బాకీ ఎగవెయ్యాలని నేను కోరుకుంటున్నాను. మూర్తివల్ల నేను తోటి వాడి పట్ల విశ్వాసాన్ని కోల్పోబట్టే కదా చైనులుకు అప్పును నిరాకరించాను? నేను కోల్పోయిన విశ్వాసాన్ని నా కళ్ళ ఎదుటే చైనులు నిరూపించటం నేను భరించలేక పోతున్నాను.

అయినా నేను రాత్రి చూసింది సత్యమా? ఇప్పుడు చూస్తున్నది సత్యమా? రెండూ సత్యాలు కావటానికి వీల్లేదుకదా? రాత్రి అంత విలాసంగా ధనాన్ని ఖర్చుచేసి తెల్లవారేసరికి బాకీని వడ్డీతోసహా తీర్చగల ఆర్థిక సత్తా కలవాడు కాదు చైనులు. మరి ...

నేను పరాజయాన్ని అంగీకరించ దల్చుకోలేదు. చైనులు సంగతి తేల్చవల్సిందే.


''చైనులుగారూ! రాణి పద్మావతీ దేవి అనే నో జూనియర్ సినిమా ఆర్టిస్ట్ కొత్త కాలనీలో ఉంటున్నది. మీకు ఆమె బాగా తెలుసు ననుకుంటా. రాత్రి నేను మిమ్మల్ని ఆమె ఇంట్లోకి వెళ్ళటం చూచ లేండి.''

చైనులు మొహంలో నేను వూహించిన మార్పు వచ్చింది. తల వంచుకొన్నాడు. చాలాసేపు మవునంగా ఉండిపోయాడు. నేను గర్వంగా శేఖరాన్ని చూశాను.

''తెలుసు సార్. గతిరాత్రేకాదు. చాలా రాత్రులుగా నేను ఆమె ఇంటి వద్దనే ఉంటున్నాను. కానీ ఎందుకనిమాత్రం అడగకండి. ప్లీజ్!''

ఆఖరికి ఎంతకి తెగించా డీ మనిషి? నాకు ఆవేశం వచ్చింది.

''ఆ ప్రశ్న మిమ్మల్ని అడగాల్సిన అవసరం లేదను కొంటాను చైనులుగారూ. ఎందుకంటే రాత్రి మీరు బార్‌లో బ్రాందీ సీసాలు, బడ్డీలో కిళ్ళీలు, సిగరెట్లపెట్టెలు, పూలు, పండ్లు, తినుబండారాలు కొనడం కూడా నేను చూచాను. అవన్నీ రాత్రి మీ కథని చెప్తున్నాయి కదా? కాని నేను తెలుసుకోవాలని ఉత్సాహ పడుతున్న విషయం ఇప్పుడదికాదు. మీ కింత డబ్బు ఎక్కడినుంచి ఎలా వస్తోంది? ఇంత ధనాధిపత్యం కల మీరు కాలేజీలో బీద ఏడుపులు ఏడవటం ఎందుకు? ఈ అప్పుల నటనల తాత్పర్యం ఏమిటి? మీ విలాస జీవితాన్ని మంచితనమనే ముసుగు చాటున దాచి ఎవర్ని మభ్యపెడ్దామని మీ ఉద్దేశం?''




భావాలన్నీ మాటల రూపంలో ఒకదానివెంట ఒకటి రావటంతో మనసు చల్లబడింది. శరీరం తేలికపడినట్లు అనిపించింది. నేను నేనయ్యా నిప్పుడు. అది చైనులు ఇల్లని, అతని భార్యా పిల్లలు నా మాటలు వింటే అతని కుటుంబ జీవితంలో చిచ్చు రగిల్చిన వాడిని నేనవుతానని గుర్తుకొచ్చింది.'

సర్వం కోల్పోయిన వాడిలా చైనులు దిగాలుపడి కూర్చుని ఉన్నాడు.

''సారీ. చైనులుగారూ. మీ రహస్య జీవితాన్ని గురించి మీ ఇంట్లో మాట్లాడి అనుచితమైన పని చేసేను. నన్ను క్షమించండి. మరోసారి ఆ విషయాలు మాట్లాడుకుందాం. ఇప్పటికి మర్చిపోండి.'' శేఖరం వైపు చూచి నేను లేచాను.

''కూర్చోండి, అన్నయ్యగారూ. ఇందులో రహస్యం ఏమీ లేదు. మీరు అనుచితంగా ప్రవర్తించనూ లేదు.''

చైనులు భార్య!

నేను బిక్కచచ్చిపోయాను.

''కాని మీ ప్రశ్నలకు ఆయన జవాబివ్వటంకన్నా నే నివ్వటం బాగుంటుం దనుకొంటాను. తన నిర్దోషిత్వాన్నో, దోషిత్వాన్నో ఆయనే నిరూపించుకొనే కన్నా నేను నిరూపిస్తే బాగుంటుంది కదా? లోకం మలభంగా నమ్ముతుంది కూడా! ... అన్నయ్యగారూ! ఆయన్ని రాణి పద్మావతీ దేవిగారి వద్దకి వెళ్ళమని ఒత్తిడి చేసింది నేనే!''

నా తల తిరిగిపోయింది. ఏమిటో ఈ భారతస్త్రీ! తన భర్తను మరో స్త్రీ వద్దకు పంపటం పాతివ్రత్య ధర్మంగా భావిస్తోందా ఈమె? లేక ...

''అలా నేను ఒత్తిడి ఎందుకు చేయవల్సి వచ్చిందో తెల్సా, అన్నయ్యగారూ! ఆమెకు ధనం ఉంది. మాకు ధనం అవసరం ఉంది. ఆయనకు అక్రమార్జన చేయటం చేతకాదు. వచ్చే జీతంతో మా కుటుంబ కనీస అవసరాలు కూడా తీరటం లేదు. వంటలు చేయటం తప్ప మరే ఉద్యోగాలు చేసే అర్హతలు లేని భార్యను నేను. ఉన్నదాంట్లో సర్దుకుపోదామంటే మధ్యలో పిల్లల అనారోగ్యాలు—అప్పులు చేయక తప్పని స్థితి. చేసిన అప్పులు తీర్చలేని దుఃస్థితిలో ఉన్నప్పుడు అప్పుచేయటం ఎంత బాధ్యతారహితమైన పనో తెలుస్తుంది. మరి అటువంటి సంసార సమస్య లెన్నో. వీటి నుంచి బయట పడడానికి రాణి పద్మావతి కోరిక ననుసరించి ఆమె వద్దకు ఆయనను పంపటం తప్ప మార్గాంతరం కన్పించలేదు నాకు.''

ధన సంపాదనకు భర్తను మరో స్త్రీ వద్దకు పంపించానని ఆమె కుండ బద్దలు కొట్టినట్లు చెప్తుంటే నేనేం మాట్లాడగలను?

''కనుక, అన్నయ్యగారూ, మీ రనుకొంటున్నట్లు మేము ధనవంతులం కాదు. ధనాధిపత్యం లేదు. అప్పులు చేయటం నాటకం కాదు. మంచితనమనే ముసుగును ఆయన వేసుకోనూ లేదు. కానీ నేను ఆయన్ని రాణి పద్మావతీ దేవివద్దకు ఎందుకు పంపేను? దాన్ని ఆయన చెప్పుకోలేదు. నేనన్నా చెప్పకపోతే మీ అసలు ప్రశ్నకు సమాధానం రాదు. అందుకని చెప్తున్నా'' అంటూ ఆమె ఆగి భర్తవైపు చూచింది.

''రాత్రి మీరు చూచిన దాన్ని ప్రచారం చేయాలని మీకు బుద్ధిపుట్టడం సహజం. అలాగా ఇప్పుడు నేను చెప్పేది విన్నాక ఆ విషయాన్ని ప్రచారం చేయాలన్న బుద్ధి పుట్ట వచ్చు. కానీ నిగ్రహించుకొని ఈ విషయానికి ప్రచారం ఇవ్వవద్దని నా అభ్యర్థన. ఇచ్చినా అది సత్యమే కనుక నేను మిమ్మల్ని తప్పు పట్టను.''

నిశ్శబ్దం. నేను ఆమె చెప్పబోయే దానికొరకు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నాను.

''రాణి పద్మావతీదేవి అందగత్తె. ఆ అందాన్ని డబ్బు చేసుకోటం ఆమె వృత్తి. అయినా ఆమెకు సమాజంలో గల స్థానం పెద్దది. అందుకే ఆమె అందాన్ని కొనుక్కోవటం కొరకు చాలా పెద్దవాళ్ళు వస్తుంటారు. తన రహస్యాన్ని, వారి రహస్యాలను కాపాడుతూ నిజాయితీతో వారి ఆనంద జీవితానికి తోడ్పడ గల వ్యక్తి కావల్సి వచ్చా డామెకి. చిత్రం! నిజాయితీ ఉన్న వ్యక్తి, నమ్మదగిన వ్యక్తి ఆమెకు కన్పించలేదు. నిజాయితీకి, విశ్వాసానికి మారు పేరైన నా భర్త సేవను ఆమె కోరింది. అది పార్ట్‌టైమ్ ఉద్యోగం. రాత్రి పూట మాత్రమే చేసేది. దానికి మీరు ఏం పేరు పెడతారో నాకు తెలియదు. కానీ రాత్రి మీరు చూచిన వన్నీ ఆయన యొక్క ఆ ఉద్యోగ ధర్మంలో భాగాలే. ఇప్పుడు అప్పు తీరుస్తున్నది ఆ డబ్బుతోనే. తాను స్వయంగా అవినీతి పని చేయలేని మనిషి, నో అవినీతి పనిని చేసేవారికి సేవచేయటం మంచిపని నేను సమర్థించుకోను. కానీ చేసిన అప్పును ఎగవేసి నో ఉన్నత వ్యక్తిలో మనుషుల పట్ల విశ్వాసాన్ని పోగొట్టే కన్నా తాత్కాలికంగా కళ్ళు మూసుకోటం మంచిదనిపించింది నాకు. అన్నయ్యగారి బాకీ తీరింది. ఇక ఇవాళ నుంచి ఆయన ఆ ఉద్యోగాన్ని చేయరు.''

అవి కన్నీటి బాష్పాలో, ఆనందబాష్పాలో చెప్పలేను కాని, నా కళ్ళు అశ్రు పూరితా లయ్యాయి.

మూర్తిలాంటి వాళ్ళను చూచి మనుష్యులపట్ల విశ్వాసాన్ని పోగొట్టుకోవటం కన్నా, చైనులులాంటి వాళ్ళను చూచి విశ్వాసాన్ని పెంచుకోవటమే మానవత్వ మనుగడకు ఆరోగ్యం అనిపించింది నాకు అప్పుడు మళ్ళీ.

మనిషి మనుగడకి అదే సార్థకత! ●